క్లుప్తంగా

శివాలయంలో పూజలు



రైల్వేకోడూరు : రైల్వేకోడూరు పట్టణంలోని శ్రీభుజంగేశ్వర ఆలయంలో సోమవారం చైర్మన్ పోకల సుబ్బరాయుడు ఆధ్వర్యంలో భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం జరిగిన రుద్రాభిషేకంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం అభిషేకాలు, అర్చనలు జరిపి, అలంకరించారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాలు పొందారు.

రెండు రోజులపాటు ఎస్‌జీఎఫ్ పోటీలు

లక్కిరెడ్డిపల్లి : స్కూల్ గేమ్స్‌లో భాగంగా అండర్ 14, 17 విభాగాలకు చెందిన బాలబాలికలకు ఈనెల 8, 9వ తేదీలలో లక్కిరెడ్డిపల్లి మండలస్థాయి పోటీలు, ఎంపికలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ మండల కో–ఆర్డినేటర్ పి.చక్రపాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8వ తేదీన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జాండ్రపల్లి నందు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా క్రీడాపోటీలు ఎంపికలు, 9వ తేదీన అదే పాఠశఆల నందు అథ్లెటిక్స్ పోటీల ఎంపికలు చేయనున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు ఉదయం 9 గంటలకు హాజరుకావాలని చెప్పారు. పోటీలలో పాల్గొనే వారు సంబంధించిన క్రీడాంశాల వివరాలు, మధ్యాహ్నం భోజన వివరాల పత్రాలు వెంట తెచ్చుకోవాలని తెలియజేశారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండండి



మాట్లాడుతున్న హెడ్‌కానిస్టేబుల్ దశరథ్

రాయచోటి జగదాంబసెంటర్ : విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని హెడ్ కానిస్టేబుల్ దశరథ్ సూచించారు. సోమవారం రాయచోటి మండల పరిధిలోని గరుగుపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, యాంటీ డ్రగ్స్, పోక్సో చట్టం, ట్రాఫిక్ నిబంధనలను వివరించి పలు సలహాలు అందజేశారు. కార్యక్రమంలో డబ్ల్యూపీసీ సురేఖ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పోలాకు సత్కారం



రాజంపేట టౌన్ : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా నియమితులైన మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డిని కాకతీయ విద్యా సంస్థల ప్రాంగణంలో సోమవారం ఆ పార్టీ రాష్ట్ర మైనార్టీ విభాగం కార్యదర్శి జాహిద్ అలీ ఆధ్వర్యంలో పట్టణంలోని ముస్లిం మైనార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటూ పార్టీ పటిష్టతకు నిరంతరం కృషి చేస్తున్న పోలా శ్రీనివాస్‌రెడ్డికి రాష్ట్ర కమిటీలో చోటు దక్కడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పోలా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై నమ్మకంతో రాష్ట్రకమిటీలో చోటు కల్పించారని, జగన్ నమ్మకాన్ని వమ్ము చేయకుండా మరింత ఉత్సాహంతో పార్టీ పటిష్టతకు పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో జాహిద్ అలీ, మసూద్ అలీఖాన్, ఖాజామోహిద్దీన్, అబ్దుల్ మునాఫ్, సత్తార్, అక్తర్, నాసిర్, యాసిన్, అంజద్, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

చాపలు వితరణ

పుల్లంపేట : మండల పరిధిలోని కేతరాజుపల్లి అంగన్‌వాడీ కేంద్రానికి ఎంపీహెచ్‌ఓ ప్రవల్లిక ఉచితంగా చాపలు అందించారు. సోమవారం అంగన్‌వాడీ కేంద్రాన్ని, వసతులను ఆమె పరిశీలించారు. పిల్లలకు ప్రతి దినం పోషకాహారం అందించాలని, గర్భిణులు, బాలింతలకు అందించాల్సిన మెనూ క్రమం తప్పక అందించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సరోజా తదితరులు పాల్గొన్నారు.

పది మంది జూదరుల అరెస్ట్

మదనపల్లె: మదనపల్లె రూరల్ మండలం బండకాడ పల్లి సమీపంలో పేకాట స్థావరంపై దాడులు జరిపి పది మందిని అరెస్టు చేశామని తాలూకా సీఐ కళా వెంకటరమణ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు బండకాడపల్లె వద్ద పేకాడుతున్నట్లు సమాచారం అందడంతో స్థావరంపై దాడులు జరిపగా పదిమంది జూదరులు పట్టుబడగా వారి వద్ద నుంచి రూ.4,23,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే ఐదు మోటార్ సైకిళ్ళు, 12 మొబైల్ ఫోన్లను సీజ్ చేశామని, మరికొందరు పరారయ్యారన్నారు. మదనపల్లెకి చెందిన అర్జున్ రెడ్డి, రమేష్ పేకాట స్థావరాన్ని నిర్వహిస్తున్నట్లు తమదష్టికి వచ్చిందని వీరు పరారీ ఉన్నట్లు చెప్పారు. వారి పై కూడా కేసు నమోదు చేశామని తెలియజేశారు.

పైప్‌లైన్ పనుల్లోనూ పచ్చ పైత్యం!

లక్కిరెడ్డిపల్లె ఎస్సీ కాలనీపై పగబట్టిన అధికార పార్టీ నాయకులు

- పైప్‌లైన్ కోసం కాలనీలో గుంతలు తీసి వదిలేసిన వైనం
- కేవలం నాలుగు కుటుంబాలకే కుళాయిల ఏర్పాటు
- కనెక్షన్ కావాలంటే టీడీపీ వారిని కలవాలంటూ కాంట్రాక్టర్ సమాధానం
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం



కాంట్రాక్టర్ నిర్వాకంతో పూర్తిగా దెబ్బతిన్న వైఎస్సార్ ఎస్సీ కాలనీ రోడ్డు

లక్కిరెడ్డిపల్లి : సమస్యలు పరిష్కరించడంలో చొరవ చూపాల్సిన అధికార పార్టీ నాయకులు, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తూ అవస్థలు పడేలా చేస్తున్నారు. ఒకప్పటి నియోజకవర్గ కేంద్రమైన లక్కిరెడ్డిపల్లెకు కూతవేటు దూరంలో ఉన్న వైఎస్సార్ ఎస్సీ కాలనీపై అధికార పార్టీ నాయకులు పగబట్టారు. కాలనీలో దాదాపు 40 కుటుంబాల వారు ఉంటున్నారు. ఇటీవల కాలంలో తాగునీటి పైప్‌లైన్ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా కాలనీలోని అన్ని ఇండ్లకు కుళాయి కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది. కానీ కూటమి నాయకులు తమ అనుయాయులకు (నాలుగు ఇళ్లకే) కుళాయి కనెక్షన్ ఇచ్చి మిగతా ఇళ్లకు కుళాయిలు ఏర్పాటు చేయకపోవడంపై స్థానిక మహిళలు, నివాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదేమని సంబంధిత కాంట్రాక్టర్‌ను అడిగితే అధికార పార్టీ నాయకుడిని కలిసి మాట్లాడితే కుళాయి కనెక్షన్ ఏర్పాటు చేస్తామని తెలియజేయడంతో కాలనీ వాసులు కంగుతిన్నారు. అంతేగాక గత ప్రభుత్వంలో వేసిన రోడ్డును పైప్‌లైన్ పనుల పేరుతో కాంట్రాక్టర్ తవ్వేసి వదిలేయడంతో చిన్నపాటి వర్షానికి కూడా నడవలేని స్థితికి మార్గం చేరుకుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అలానే రోడ్డుపై పెద్దబండరాలను అలానే వదిలేయడంతో వృద్ధులు, చిన్నారులు గాయాలబారీన పడుతుండటమే కాక ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లాలేని దౌర్భగ్య స్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు.

సమస్యలు పరిష్కరించడంలో విఫలం

వైఎస్సార్ కాలనీ ప్రజలు అనేక సమస్యలతో జీవనం సాగిస్తున్నారు. వీటిని పరిష్కరించాల్సిన అధికారులు, నాయకులు విఫలమయ్యారనే వాదన వినపడుతోంది. ఇప్పటికే సమస్యలను మండల స్థాయి నుంచి ఉన్నతస్థాయి అధికారుల వరకు తెలియజేసిన వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టకపోవడంపై ప్రజలు అసహనం తెలియజేస్తున్నారు. ప్రధాన రహదారి నుంచి వైఎస్సార్ ఎస్సీ కాలనీకి వెళ్లాల్సిన రోడ్డు వేయకపోవడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే సమయంలో కాలనీ వాసులు అవస్థలు ఎదుర్కోక తప్పడంలేదు. వీధిలైట్లు లేకపోవడంతో రాత్రి వేళల్లో బయటకు రావాలంటే ప్రజలు జంకుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికే పలువురు పాము కాటుకు గురై చికిత్స పొందారని కాలనీ వాసులు పేర్కొన్నారు.

సానుకూలంగా స్పందించాలంటూ..

సమస్యలతో సతమతమవుతున్న ఆ కాలనీ వాసుల ఇబ్బందులను పరిష్కరించే విధంగా ప్రభుత్వం చొరవ చూపాలని స్థానికులు విన్నవిస్తున్నారు. అలానే కాలనీలో నీటి సమస్యకు శాశ్వతంగా పరిష్కరించాలని, కుళాయి కనెక్షన్‌కు తీసిన గుంతలను పూడ్చి రోడ్డు వేయడమే కాకుండా, కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించి ఆదుకోవాలని అధికారులను స్థానిక ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపైనే వదిలేసిన బండరాళ్లు

తవ్వేసి వదిలేశారు



ఇంటింటికి కుళాయి కనెక్షన్ ఇస్తామని మా కాలనీలో నాలుగు ఇళ్లకు మాత్రమే కుళాయి కనెక్షన్ ఇచ్చి కాలువలు తీసి పూడ్చకుండా వదిలేశారు. కాలనీలో బండ్లు తిరగలేని పరిస్థితి ఉంది. ముసలివారు వీధుల్లో తిరగలేకపోతున్నారు. వీధుల్లోని రోడ్లపై ఎక్కడికక్కడ రాళ్లు అలానే ఉంచారు. చిన్నపాటి వర్షానికి నడవాలంటేనే ఇబ్బందిగా ఉంది. కాంట్రాక్టర్‌ను అడిగితే తెదేపా నాయకుడు దగ్గరికి వస్తే మిగతా ఇళ్లకు కూడా కుళాయి కనెక్షన్లు ఇస్తామంటూ అన్నారు. తాగే నీళ్ల వద్ద రాజకీయం చేస్తున్నారు. మా కాలనీ వాసులకు సౌకర్యాలు కల్పించాలి.

– ఆదిలక్ష్మమ్మ, వైఎస్సార్ ఎస్సీ కాలనీ నివాసి, లక్కిరెడ్డిపల్లి

లైట్లు లేక పాముకాటుకు గురయ్యా



మా కాలనీలో వీధిలైట్లు లేకపోవడంతో రాత్రి సమయాలలో బయటకు వెళ్లగా నేను పాము కాటుకు గురై చికిత్స పొంది ఇంటి వద్దనే ఉంటున్నాను. మా కాలనీలో చీకటి పడిందంటే బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొని ఉంది. ఈ విషయం పలుమార్లు గ్రామ పంచాయతీ అధికారులకు విన్నవించుకున్నా ఇప్పటి వరకు వీధి లైట్లు ఏర్పాటు చేయలేదు. ముందు బిగించిన వీధిలైట్లు వెలగడం లేదు. చిన్నపిల్లలు, ముసలివారు రాత్రి బయటకు పోవాలంటే భయ భ్రాంతులకు గురవుతున్నాం. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని మా కాలనీలో వీధిలైట్లు రిపేరు చేయించి లేని దగ్గర కొత్తవి బిగించాలి.

– గంగులమ్మ, వైఎస్సార్ కాలనీ నివాసి, లక్కిరెడ్డిపల్లి

దారిలేక అవస్థలు



మా కాలనీ నుంచి మెయిన్ రోడ్డుకు రోడ్డు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. కాలనీకి ఇటువైపు, అటువైపు ఉన్నవారు వారి భూములకు కంచెలు వేసుకున్నారు. మేము రోడ్డుపైకి వెళ్లాలంటే దారిలేక ఇబ్బందులు పడుతున్నాం. లక్కిరెడ్డిపల్లి ఎంఆర్‌ఓకు, కలెక్టర్‌కు అర్జీ కూడా ఇచ్చాం. మీకు దారి ఉందిలే చూపిస్తాం వేస్తామంటున్నారే తప్ప తరువాత పట్టించుకోవడం లేదు. పై అధికారులు మా కాలనీకి మెయిన్ రోడ్డు నుండి దారిని ఏర్పాటు చేయించాలి. ప్రస్తుతం అధ్వానంగా మారిన రోడ్డును బాగుచేయాలి.

– గీత, వైఎస్సార్ ఎస్సీ కాలనీ, లక్కిరెడ్డిపల్లి

ఉపాధ్యాయుడికి పురస్కారం



అవార్డును అందుకుంటున్న రెడ్డయ్యరాజు

సుండుపల్లె : అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సుండుపల్లె వశిష్ట హైస్కూల్ డైరెక్టర్ కెసి రెడ్డయ్యరాజు విశిష్ట ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఆదివారం రాజమండ్రిలో రాజమండ్రి ఎడ్యుకేషన్ విద్యారంగ పత్రిక గోదావరి టాలెంట్ టెస్ట్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం జరిగింది. రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ చేతులమీదుగా రెడ్డయ్యరాజు పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది, అధ్యాపకులు ఆయనకు అభినందనలు తెలిపారు.

సెరిబ్రల్ పాల్సీపై అవగాహన

మదనపల్లె సిటీ: స్థానిక అమ్మచెరువుమిట్టవద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో సోమవారం ప్రపంచ సెరిబ్రల్ పాల్సీ పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సెరిబ్రల్ పాల్సీ అంటే మెదడు పక్షవాతం అనీ, ఇది ఒక రుగ్మత , దీనిని నయం చేయడానికి ఎలాంటి మందులు లేవన్నారు. సెరిబ్రల్‌పాల్సీ ఉన్న పిల్లలకు ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, ఆపరేషన్స్, సహాయ పరికరాలు ఉపయోగిచడం ద్వారా రుగ్మత తీవ్రతను తగ్గించగలమన్నారు. సెరిబ్రల్ పాల్సీ గల జ్యోతి కిరణ్ తల్లి రాధమ్మ మాట్లాడుతూ మా బాబుకు ఎడమ చెయ్యి, ఎడమ కాలు సెరిబ్రల్ పాల్సీ ఉండటంతో ప్రతి రోజు ఫిజియోథెరపీ చేయిస్తున్నామన్నారు. దైనందిక కార్యక్రమాలు చేయించడం వల్ల కండరాల్లో కదలికలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ లీనాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి కృషి



ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న గాలివీటి విజయభాస్కర్ రెడ్డి

వీరబల్లి : మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గాలివీటి విజయభాస్కర్ రెడ్డి రాష్ట్ర ఎగ్జిక్యూటీవ్ కౌన్సిల్ మెంబర్‌గా నియామకం అయ్యారు. ఈ సందర్భంగా సోమవారం రాజంపేట ఎమ్మెల్యే, అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు ఆకేపాటి అమర్నాథ రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతోపాటు మండల ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి, పెదివీటి సర్పంచ్ నాగిరెడ్డి, అన్నమయ్య జిల్లా వైఎస్సార్ పార్టీ ప్రధాన కార్యదర్శి అమర్నాథ రెడ్డి తదితరులు కలిసి ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించారు. అనంతరం విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షులు జగన్‌మోహన్ రెడ్డి తమకు ఈ బాధ్యతలు అప్పజెప్పడం సంతోషంగా ఉందన్నారు. తనమీద పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అలాగే ఎమ్మెల్యే సోదరుడు అనిల్‌కుమార్ రెడ్డిని కూడా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే ఆకేపాటి విజయభాస్కర్ రెడ్డిని శాలువాలతో సన్మానించారు.

టాలెంట్ టెస్ట్‌ల పేరుతో కార్పొరేట్ల దోపిడీ



మాట్లాడుతున్న ప్రభాకర్‌నాయుడు

రాజంపేట రూరల్ : కార్పొరేట్ విద్యా సంస్థలు టాలెంట్ టెస్టుల పేరుతో అనధికారకంగా చేసే వసూళ్లను నిషేధించాలని రాజంపేట అపుస్మా(ప్రైవేట్ స్కూల్స్ యూనియన్ కార్యవర్గం) అధ్యక్షులు ప్రభాకర్‌నాయుడు అధికారులను కోరారు. స్థానిక రాజు హైస్కూల్‌లో సోమవారం రాజంపేట అపుస్మా ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న అపుస్మా ప్రతినిదులు మాట్లాడుతూ విద్యార్థుల వద్ద నగదు వసూల్ చేస్తున్న నారాయణ, శ్రీచైతన్య స్కూళ్లపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పది మందికి ఉపాధి కల్పిస్తూ నిరుద్యోగులు ఏర్పాటు చేసుకున్న చిన్నచిన్న ప్రైవేటు విద్యాసంస్థలలో విద్యనభ్యసిస్తున్న పిల్లల బయోడేటాను సేకరించి వచ్చే సంవత్సరానికి అడ్మిషన్ తీసుకుంటున్న కార్పొరేట్ విద్యా సంస్థలపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాశాఖ అధికారులు చొరవ చూపి అనధికారంగా నిర్వహించే టాలెంట్ టెస్ట్‌లను నిషేధించాలన్నారు. ఈ సమావేశంలో రాజంపేట అపుస్మా ప్రధాన కార్యదర్శి సుభాన్, జిల్లా కార్యదర్శి రాఘవ రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, జిల్లా కోశాధికారి వై నందకిషోర్, ప్రతినిధులు చౌదరి, సుబ్బరాయుడు, జి.రఘురామరాజు, కె.భరత్‌కుమార్‌రాజులు తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన వీధులు



నీట మునిగిన వీధులను పరిశీలిస్తున్న అధికారులు

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లెలోని ఆర్ అండ్ బీ బంగ్లా వెనుక వైపు ఉన్న వీధులు నీట మునిగాయి. సోమవారం నీట మునిగిన వీధులను అధికారులు పరిశీలించారు. ఎంపీడీఓ రాధాకృష్ణ, పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాసులు, పంచాయతీ సెక్రటరీ సురేష్ బాధితులతో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. నీటిసంఘం అధ్యక్షుడు వెంకటసుబ్బయ్యను పిలిపించి చెరువుకు నీటిని తరలించే కాలువలో ప్రవాహ వేగాన్ని తగ్గించాలని సూచించారు. ఉన్నతాధికారులకు సమస్యను వివరించారు. ప్రజలకు సమస్య తలెత్తకుండా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఇంత జరుగుతున్నా ఇరిగేషన్ అధికారులు మాత్రం నీటమునిగిన సమస్యాత్మక ప్రాంతాలను సందర్శించకపోవడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న కార్మిక నాయకులు వేణుగోపాల్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలోని ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించి వారికి ఉద్యోగభద్రత కల్పించాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు గుంటి వేణుగోపాల్, జిల్లా అధ్యక్షురాలు యు. మరియమ్మ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ఏఐటియూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆశాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ కడప జిల్లా సమితి ఇచ్చిన పిలుపుమేరకు మంగళవారం జరిగే ఆశాడే సందర్భంగా జిల్లాలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని డాక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వనున్నామన్నారు. రాష్ట్రంలో కూటమి నేతలు ఎన్నికల ప్రచారంలో ఆశాలకు మెరుగైన వేతనాలు ఇస్తామని, ఉద్యోగ భద్రత కలిపిస్తామని, సంక్షేమ పథకాలు వర్తింప చేస్తామని ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం తక్షణం అమలు చేయాలన్నారు.

ముమ్మరంగా తనిఖీలు

పెద్దతిప్పసముద్రం : ములకలచెరువులో తెలుగు తమ్ముళ్ల కల్తీ మద్యం తయారీ అంతర్జాతీయ మాఫీయాను తలపించేలా పోలీసు దాడుల్లో గుట్టు రట్టు కావడం రాష్ట్రంలో తీవ్ర ప్రకంపనలు రేపింది. పట్టుబడిన కల్తీ మద్యం కేసులో ఇప్పటికే పలువురు రిమాండ్‌లో ఉండగా ఇన్నాళ్ళూ తయారీ కేంద్రం నుంచి బెల్ట్‌షాపులకు కల్తీ మద్యం బాటిళ్ళను రవాణా చేసినవారు, మద్యం నిల్వలకు సహకరించారని అనుమానాలు ఉన్న మరి కొందరు నిందితులు పరారీ కావడంతో పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలో బెల్ట్‌షాపులపై విస్తృతంగా తనిఖీ చేపట్టారు. సోమవారం ఎస్ఐ హరిహరప్రసాద్ సిబ్బందితో కలసి కల్తీ మద్యం నిల్వలు, పేకాట స్థావరాలలతో పాటు అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్టు అనుమానాలు ఉన్న ప్రాంతాల్లో డ్రోన్‌తో పరిశీలించారు.

టెట్ నుంచి టీచర్లకు ఉపశమనం కల్పించాలి



మాట్లాడుతున్న ఎన్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు

రాజంపేట టౌన్ : సర్వీసు ఉపాధ్యాయులు టెట్ ఉత్తీర్ణత సాధించాలన్న నిబంధన నుంచి ఉపశమనం కలిగించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు కోరారు. సుప్రీం కోర్టు తీసుకొచ్చిన ఈ నిబంధనపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలన్నారు. రాజంపేట పట్టణంలోని ఉర్దూ హైస్కూల్‌లో సోమవారం జరిగిన ఎన్‌టిఏ నాయకుల సమావేశంలో శ్రీనివాస్‌రాజు పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు టెట్ ఉత్తీర్ణత సాధించాలన్న నిబంధన పూర్తిగా అసమంజసమైనదని తెలిపారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు కూడా ఎక్కువయ్యాయని, అలాగే పిల్లల చదువుల విషయాలు, వారి వివాహాలు, కుటుంబానికి సంబంధించిన ఇతరత్రా పనుల వల్ల ఉపాధ్యాయులు టెట్ పరీక్షకు ప్రిపేర్ కావాలంటే ఏమాత్రం సమయం ఉండదని చెప్పారు. ఈ విషయాన్ని అత్యున్నత న్యాయ స్థానం మానవీయకోణంలో ఆలోచించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా ఇంతవరకు ఒక్క డీఏ కూడా ఇవ్వకపోవడం విచారకరమన్నారు. డిఎలతో పాటు అరియర్స్‌ను కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే పిఆర్‌సి కమిటీని నియమించాలని, కమిటి రిపోర్ట్ వచ్చే లోపు ఐఆర్ ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను చెల్లించాలన్నారు. ఎంటిఎస్ టీచర్లకు 12 నెలల వేతనం ఇవ్వాలని అలాగే ఎంటీఎస్ టీచర్ల పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. ప్రస్తుతం డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులను సింగిల్ టీచర్లు ఉన్న పాఠశాలల్లో నియమించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం డివిజన్, మండల నాయకులు అరవ ఉమామహేశ్వర్, రఘువీరరాజు, సోమశేఖర్, జమాల్‌బాషా, వీరప్రసాద్, రెడ్డిచెర్ల హరిప్రసాద్, బాలచంద్రశేఖర్, పరమేశ్వరమ్మ, చిట్టిగారి వెంకటసుబ్బయ్య, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మిథున్ రెడ్డిని కలిసిన నాయకులు



ఎంపీ మిథున్ రెడ్డితో శివారెడ్డి, జైరాంరెడ్డి

ఒంటిమిట్ట : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని ఒంటిమిట్ట మండల వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం విజయవాడలోని ఆయన గృహంలో కలిశారు. ఈ సందర్భంగా నాయకులు ఒంటిమిట్ట ఉపఎన్నికలో జరిగిన కూటమి నాయకుల దౌర్జన్యాలు, సర్పంచ్ చెక్ పవర్ రద్దు విషయాలను ఎంపీకి తెలియజేశారు. అలానే మండలంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు కూటమి నాయకుల ఎలా ఇబ్బంది పెడుతున్నారో వివరించారు. కార్యకర్తలు అండగా ఉంటామని ఎంపీ మిథున్‌రెడ్డి భరోసా కల్పించారు. కూటమి అరాచకాలను డిజిటల్ బుక్‌లో నమోదుచేయాలని సూచించారు. ఎంపీని కలిసిన వారిలో ఒంటిమిట్ట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు టక్కోలు శివారెడ్డి, రాచగుడిపల్లి వైఎస్సార్‌సీపీ నాయకుడు జైరాం రెడ్డి తదితరులున్నారు.

కార్మికులను తొలగిస్తే ఉద్యమిస్తాం



కార్మికులతో మాట్లాడుతున్న రవిశంకర్ రెడ్డి

కడప అర్బన్ : రిమ్స్‌లో నూతనంగా శానిటేషన్, సెక్యూరిటీ ఏజెన్సీ బాధ్యతలను చేపట్టనున్న ఓ ప్రైవేట్ సంస్థ ఇక్కడ పనిచేస్తున్న కార్మికులను తొలగించాలని చూస్తోందని, 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులను తొలగించటం చట్ట వ్యతిరేకమని, దానిని ఏమాత్రం ఆర్‌సీపీ సహించబోదని, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవి శంకర్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం రిమ్స్‌లో కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రిమ్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు చట్ట ప్రకారం వేతనాలు అందడంలేదని, ఈఎస్ఐ, పీఎఫ్‌లలో గోల్‌మాల్ జరుగుతున్నాయని, నెలనెలా వేతనాలు అందించడంలో జాప్యం నెలకొంటుందన్నారు. కార్మికులకు రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ వారికి అండగా ఉండి పోరాడుతుందని తెలిపారు.

పాఠశాల ఆవిర్భావ వేడుకకు ఏర్పాట్లు పూర్తి



వేడుక కోసం ఏర్పాటైన చలువ పందిరి



వేదిక అలంకరణ పనుల్లో అధ్యాపకులు, విద్యార్థులు

రాజంపేట టౌన్ : రాజంపేట ప్రభుత్వ హైస్కూల్‌కు ఘనమైన చరిత్ర ఉంది. హైస్కూల్ ఏర్పాటై మంగళవారం నాటికి తొంబై ఒక్క సంవత్సరాలు అవుతుండటంతో అవిర్భావ దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ప్రభుత్వ హైస్కూల్ ప్రాంగణంలోనే ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో చేపడుతున్నారు. ఈవేడుకలో పాల్గొనే పూర్వ విద్యార్థులను కనువిందు చేసేలా సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్వీ రమణరాజు ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు అలంకరణ పనులు చేపడుతున్నారు. అందులో భాగంగా వేదిక ప్రాంగణాన్ని పూలతో శోభాయమానంగా అలంకరిస్తున్నారు. ఇక పూర్వ విద్యార్థి, రిటైర్డ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నెట్టెం శ్రీరాములునాయుడు ఆధ్వర్యంలో పలువురు పూర్వ విద్యార్థులు ఆవిర్భావ వేడుకలో పాల్గొనే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. తొలిసారిగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహిస్తుండటంతో పూర్వ విద్యార్థుల్లో ఆనందం తొణికిసలాడుతుంది. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో అతిపెద్ద ప్రభుత్వ హైస్కూల్స్‌లో ఒకటైన రాజంపేట ప్రభుత్వ హైస్కూల్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు తొలిసారిగా నిర్వహిస్తుండటంతో పట్టణ ప్రజలే కాక గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు సైతం చర్చించుకుంటున్నారు. ఏ నలుగురు కలిసిన ప్రభుత్వ హై స్కూల్ ఆవిర్భావ దినోత్సవం గురించి చర్చించుకుంటుండటం విశేషం.

స్వచ్ఛతకు పురస్కారాలు



పురస్కారం అందుకుంటున్న మంగంపేట సర్పంచ్ సుధాకర్, పంచాయతీ సిబ్బంది

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు జిల్లాస్థాయి స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర పురస్కారానికి ఎంపికైంది. పాఠశాలలో పరిశుభ్రతతోపాటు పచ్చదనం, మొక్కలు నాటడం వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించడంతో పురస్కారం వరించింది. అలానే మంగంపేట పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్ స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రకు ఎంపికైంది. బెస్ట్ అంగన్‌వాడీ కేంద్రంగా మంగంపేట అంగన్‌వాడీ సెంటర్ ఎంపికై ంది. సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పాఠశాలకు సంబంధించి జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు సీపీ శ్రీకృష్ణ, మంగంపేట పంచాయతీకి సంబంధించి సర్పంచ్ మినుగు సుధాకర్, జిల్లా కలెక్టర్ చేతులమీదుగా పురస్కారాలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రామ్మోహన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజానికి సమష్టి కృషి

కడప ఎడ్యుకేషన్ : డ్రగ్స్ లేని సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేసి తమ పాత్ర పోషించాలని ఈగల్ సెల్ అధికారులు సూచించారు. సోమవారం కడప తాలూకా పోలీసు స్టేషన్ పరిధిలోని యస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో కడప జిల్లా పోలీసు కళా జాతా, శక్తి టీమ్, నార్కోటిక్ టీమ్, ఈగల్ సెల్ సంయుక్తంగా విద్యార్థులకు డ్రగ్స్, మాదక ద్రవ్యాల వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఈగల్ అధికారులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం రాష్ట్రవ్యాప్తంగా ‘ఈగల్’ పేరుతో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసిందన్నారు. డ్రగ్స్ వాడకం, అమ్మకాలు చట్ట ప్రకారం నేరమన్నారు.

మీ ఇల్లు లేదా కళాశాల చుట్టుపక్కల డ్రగ్స్ అమ్మకాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే 1972 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తెలియని లింక్‌లు క్లిక్ చేయవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుదర్శన్ రెడ్డి, తాలూకా పోలీస్ స్టేషన్ ఎస్ఐ నాగతులసి ప్రసాద్ , ఫ్యాక్షన్ జోన్ ఎస్సై, కళా జాతా ఇంచార్జ్ సుబ్రహ్మణ్యం, శక్తి టీం, టీడీఏఎస్ సిబ్బంది, నార్కోటిక్ సెల్ నుంచి మల్లయ్య, ఈగల్ బృందం సభ్యులు అయూబ్ ఖాన్, గురు శేఖర్ పాల్గొన్నారు.